## క్లుప్తంగా

### పెద్దవెలగటూరులో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

**పెద్దపంజాణి:** మండలంలోని పెద్దవెలగటూరులో సోమవారం పెద్దపంజాణి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మురళి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. తదుపరి గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి, వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని గ్రామస్తులను ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ భవాని, ఆశా వర్కర్లు రేణుక, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

### సంచార జాతుల మండల కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రాన్ని అందజేస్తున్న పూసల రవి

**రామకుప్పం:** 32 కులాలకు సంబంధించిన సంచార జాతుల మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన వెంకటాచలపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సంచార జాతుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా న్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసల రవి మాట్లాడారు. సంచార జాతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు మండలస్థాయిలో కమిటీ ఎన్నికలను నిర్వహించినట్లు తెలిపారు. అధ్యక్షుడితో పాటు మండల ప్రధాన కార్యదర్శిగా పక్కెల రమేష్, ప్రచార కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా బయప్ప, మంజునాథ్, రాజప్ప, సోమశేఖర్, కార్యదర్శులుగా రాజగోపాల్, రామప్పను ఎన్నుకున్నట్లు తెలియజేశారు. సమావేశంలో సుబ్రమణ్యం, మురళి, మహేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### విద్య, వైజ్ఞానికి ప్రదర్శన ఆవిష్కరణలకు వేదిక

**చిత్తూరు కలెక్టరేట్:** జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆవిష్కరణలకు వేదిక అని డీఈఓ వరలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టామన్నారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. బాల మేధావులే భావి భారత శాస్త్రవేత్తలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, శాస్త్రీయ పరిశీలనాశక్తిని వెలికితీసేందుకు సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఇందులో ప్రతిభ చాటే విద్యార్థులు జనవరి 21 నుంచి 25వ తేదీ వరకు దక్షిణభారత స్థాయిలో పుదుచ్చేరిలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులు కచ్చితంగా పాల్గొనేలా ఎంఈఓలు పర్యవేక్షించాలని డీఈఓ వెల్లడించారు.

# ఉచిత పంటల బీమాకు మంగళం!



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఉచిత బీమా పథకానికి ప్రీమియం చెల్లిస్తే, ఈ ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనికి మంగళం పాడింది. పైగా బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడంతో అసలే కష్టాల్లో ఉన్న రైతులు ఇది భారంగా పరిణమించింది. గత ప్రభుత్వం ప్రీమియం చెల్లించగా లేనిది ఈ ప్రభుత్వం మాత్రం ఎందుకు చెల్లించదని రైతులు ప్రశ్నిస్తున్నా వారికి సమాధానం చెప్పేవారు లేరు. మంగళవారం పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు గడువు ముగియనుంది. ఇప్పటిదాకా జిల్లాలో ప్రీమియం చెల్లించిన రైతులు పదిశాతం కూడా లేదు. దీంతో ఈ పర్యాయం 90శాతం మందికి బీమా దీమా ఇవ్వనట్టైంది.

- రైతుల బీమా ప్రీమియం గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే కట్టింది
- ఇప్పుడు రైతులే కట్టాలని కూటమి ప్రభుత్వ ఆదేశాలు
- మండిపడుతున్న రైతాంగం
- పంటలబీమా చెల్లించేందుకు నేడే ఆఖరు
- ఈలెక్కన 90 శాతం మంది రైతులకు ౦.ఈసారి బీమా లేనట్టే..!



**పలమనేరు:** జిల్లాలో వరి, వేరుశనగ, మామిడితోపాటు ఎక్కువగా కూరగాయల సాగు చేస్తున్నారు. కానీ జిల్లాకు సంబంధించి వరి, మామిడి, వేరుశనగకు మాత్రం పంటల బీమా సౌకర్యాన్ని కల్పించారు. వరి ఎకరానికి రూ.82 చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాల మూలాన పంట నష్టపోతే పరిహారంగా రూ.40 వేలు, అలాగే వేరుశనగకు రూ.60 కడితే రూ.30వేలు, మామిడికి రూ1750 చెల్లిస్తే రూ.35వేలు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఈ ప్రీమియంను గతంలో ప్రభుత్వమే కట్టి పరిహారాన్ని రైతుల ఖాతాల్లోకి జమ చేసింది. గత ప్రభుత్వం లాగే కూటమి ప్రభుత్వం కూడా బీమా ప్రీమియం చెల్లిస్తుందని ఆశాభావంతో ఉన్న రైతులకు కూటమి ప్రభుత్వం నిర్ణయం శరాఘాతమైంది. మరోవైపు మామిడి పంటకు ప్రీమియం ఎక్కువ చేసి పరిహారాన్ని తగ్గించడంతో మామిడి రైతులు ఎక్కువ మొత్తంలో ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రావడం లేదు.

**బ్యాంకు రుణాలకు రైతుల నుంచే ప్రీమియం వసూళ్లు**

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో మొత్తం 274 బ్యాంకులున్నాయి. వీటిల్లో ఈసారి పంట రుణాలుగా రైతులకు రూ.7237కోట్లను, టర్మ్ రుణాలుగా రూ.3429కోట్లను మొత్తంగా వ్యవసాయ రంగానికి సంబంధించి రూ.11,153కోట్లను రుణాలుగా ఇచ్చారు. దీంతో రుణాలు పొందినప్పుడే పంటల బీమా ప్రీమియంను బ్యాంకర్లు ఆ రుణం నుంచి కట్ చేసుకున్నారు. సాధారణంగా రైతులు తీసుకున్న రుణమొత్తంలో రబీలో 1.5%, ఖరీఫ్‌లో 2,5% రెండు సీజన్లలో అయితే 5శాతాన్ని ప్రీమియంగా కట్టించుకుంటారు. అంటే రైతు లక్ష రుణంగా పొందితే అందులో రూ.5వేలను బీమా కింద చెల్లించాలి. ఈ నిబంధనలను మీరి సప్తగిరి గ్రామీణ బ్యాంకుల్లో ఎక్కువగా డబ్బులు కట్టించుకుంటున్నారని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. వాస్తవంగా అయితే సంబంధిత పంటలకు ప్రభుత్వం నిర్ణయించిన మొత్తాన్ని మాత్రమే బ్యాంకులు రుణాలిచ్చిన రైతు నుంచి ప్రీమియంగా తీసుకోవాల్సి ఉన్నప్పటికీ వారు ఎక్కువగా వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

**స్పందన నిల్**

ఇదిలా ఉండగా రైతుల నుంచి వందశాతం పంటలకు ఈ–క్రాప్ చేసి వారి నుంచి పంటలకు ప్రీమియం వసూలు చేయించాలని వ్యవసాయం హార్టికల్చర్ ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బందికి కొన్నిరోజుల క్రితం లక్ష్యంగా నిర్దేశించారు. గతంలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లించినందున ఇప్పుడు కూడా ప్రభుత్వమే చెల్లించాలని రైతులు డిమాండ్ చేయడంతో టార్గెట్ కొండెక్కింది.

**ఇదిగో సాక్ష్యం**

నియోజకవర్గంలో రైతులు 56వేల మంది వరకూ ఉన్నారు. ప్రస్తుతం అన్ని రకాల పంటల సాగు 67 వేల హెక్టార్లుగా ఉంది. ఇప్పటి వరకూ పంటల క్రాప్ బుకింగ్ చేసింది కేవలం పది శాతం కన్నా తక్కువే. దీంతో ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులకు మాత్రమే పంట నష్టపరిహారానికి ప్రీమియం చెల్లించే అవకాశం ఉంటుంది. ఇదే పరిస్థితి జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లోనూ ఉంది.

**ఈసారి పంటల బీమా చాలా తక్కువ**



పంట నమోదు చేసుకుని ఆయా పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని జిల్లా వ్యాప్తంగా రైతులకు అవగాహన కల్పించాం. ఇటీవల పలమనేరులోనూ పర్యటించి ఇదే విషయాన్ని రైతులకు తెలియజేశాం. మండలంలో 1,222 ఎకరాల్లో పంటల సాగు ఉండగా క్రాప్ బుకింగ్, బీమా జరిగింది కేవలం 360 ఎకరాలు మాత్రమే. జిల్లా వ్యాప్తంగా పరిస్థితి ఇలాగే ఉంది.

–మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, చిత్తూరు

**ఇలా మోసం చేస్తారనుకోలేదు**



మొన్న ఎన్నికల్లో కూటమి నేతల మాటలు నమ్మి ఓటేసినందుకు ఇప్పుడు చాలా బాధ పడుతున్నాం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు పంటల బీమా ప్రీమియాన్ని కట్టింది. దీంతో నష్ట పరిహారం రైతులకు అందింది. ఇప్పుడు రైతులే కట్టాలని, అది కూడా ఈనెలాఖరు లోపు అంటే అది జరిగేపని కాదు. ప్రభుత్వమే రైతులకు బీమా ప్రీమియం కట్టి రైతాంగాన్ని ఆదుకోవాలి.

–ఉమాపతి, రైతు సంఘ నేత, ముసలిమొడుగు

**ముందంతా వైఎస్సార్ గవర్మెంటే కట్టిందే**



గత ప్రభుత్వ పాలనలో రైతుల పంటల ప్రీమియాన్ని ప్రభుత్వమే కట్టింది. ఇప్పుడు అధికార కూటమి ప్రభుత్వం కూడా అలాగే కడుతుందని అనుకున్నాం. బీమా మరో మూడు రోజుల్లో ముగుస్తున్న టైంలో వచ్చి రైతులంతా మీరే డబ్బులు మీ–సేవలో కట్టుకోమంటే యాణ్ణుంచి తెచ్చేది? కనీసం రైతుల ప్రీమియం కూడా చెల్లించలేని ఈ ప్రభుత్వం ఇక జనానికిచ్చిన హామీలను ఏం చేస్తుందో ఏమో..!

–నాగరాజు, రైతు, పెంగరగుంట, పలమనేరు మండలం

### నూతన సంవత్సర వేడుకలపై ఆంక్షలు: సీఐ

**పుంగనూరు:** నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎవరైన హద్దులు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాత్రి పూట నూతన సంవత్సర వేడుకలపై నిబంధనలు పెట్టామన్నారు. రోడ్లపై మద్యం సేవించి, కేక్‌లు కట్ చేయడం, బాణసంచా కాల్చడం, హారన్లమోతతో బైక్ ర్యాలీ చేస్తే సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో జరుపుకోవాలని హితవు పలికారు.

### నిత్యాన్నదానానికి 13 టన్నుల కూరగాయల వితరణ



టీటీడీ వాహనానికి పూజలు చేస్తున్న శ్రీవారి సేవకులు

**పలమనేరు:** తిరుమల, కాణిపాకంలో జరుగుతున్న నిత్యాన్నదానం పథకాలకు పలమనేరుకు చెందిన దాతలు 13 టన్నుల కూరగాయలను వితరణ చేశారు. పలమనేరు పట్టణానికి చెందిన దాతల సాయంతో స్థానిక శ్రీవారి సేవకులు తిరుమలోని తరిగొండ వెంగమాంబ నిత్యాన్నదాన పథకానికి పది టన్నులు, కాణిపాకంలోని నిత్యాన్నదాన పథకానికి 3 టన్నుల వివిధ రకాల కూరగాయలను టటీడీ వాహనంలో సోమవారం ఇక్కడి మార్కెట్ నుంచి తరలించారు. ఈ సందర్భంగా గోవింద నామ స్మరణల నడుమ టీటీడీ ప్రత్యేక వాహనానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రవి, కిశోర్, దాతలు మురళీ కాఫీవర్క్స్ శ్రీకాంత్, మంజునాథ్, శ్యామ్, వెంకటేష్, జైసింగ్, మహేంద్రలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మండీ యజమానులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

### నేడే పెన్షన్లు పంపిణీ

**పుంగనూరు:** ప్రభుత్వాదేశాల మేరకు ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ లీలామాధవి సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి పెన్షన్లు అందజేస్తారని, లబ్ధిదారులు ఇళ్ల వద్దనే ఉండి వాటిని పొందాలని కోరారు.

## భూ సమస్య పరిష్కరించాలని ధర్నా

- ఒకరి భూమిని మరొకరు కాజేసిన వైనం
- అధికారులతో కుమ్మక్కై ఆన్‌లైన్‌లో నమోదు
- బాధితురాలు ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోని అధికార గణం



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సంస్థ నాయకులు

**బైరెడ్డిపల్లి:** మండలంలోని దేవదొడ్డికి చెందిన యశోదమ్మ భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. జిల్లా నాయకులు మునిరత్నం, పార్థసారథి మాట్లాడారు. యశోదమ్మ భర్త క్రిష్ణప్ప పేరిట పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమి సుమారు 2 ఎకరాలు ఉందన్నారు. గత ఏడాది భర్త మృతి చెందడంతో యశోదమ్మ పిల్లలతో బెంగళూరుకు కూలీ పనులకు వెళ్లి అప్పుడప్పుడూ గ్రామానికి వచ్చేదన్నారు. యశోదమ్మ అనారోగ్యం కారణంగా కొంత కాలంగా దేవదొడ్డికి రాకపోవడంతో వెంకటేష్ అనే వ్యక్తి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ భూమిని తన పేరిట ఆన్‌లైన్‌లోకి మార్చుకున్నాడని, ఇది తెలుసుకున్న బాధితురాలు రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా స్పందించడం లేదని మండిపడ్డారు. ఆన్‌లైన్‌లో నమోదైన నంబర్లను రద్దు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మాధవరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రత్నమ్మ, సాంబశివ, గుర్రం సుబ్రమణ్యం, శ్రీనివాసులు, నాగార్జున, గాయత్రి పాల్గొన్నారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి, న్యాయవాదులు

**చిత్తూరు అర్బన్:** న్యాయవాదుల సంఘం 2025 సంవత్సర క్యాలెండర్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు ఆవిష్కరించారు. చిత్తూరు నగరంలోని జిల్లా జడ్జి చాంబర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నల్లారి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

## రోగుల చికిత్సకు ఆధార్ లింకు కష్టాలు!

- ఓపీడీకెళితే ఆధార్ లింకున్న ఫోన్ నంబర్ తప్పనిసరి
- ఫోన్ లేని వారికి, ఉన్నా లింక్ కాని వారికి ఇబ్బందులు
- అభా యాప్‌లో రోగి వివరాలను నిక్షిప్తం చేసేందుకంటున్న వైద్యులు



పలమనేరు ఏరియా ఆస్పత్రి

**పలమనేరు:** స్థానిక ఏరియా ఆస్పత్రితోపాటు నియోజకవర్గంలోని పీహెచ్‌సీల్లో పలు రకాల వైద్య సేవల కోసం వెళ్లే రోగులకు ఆధార్ నంబర్‌తో అనుసంధానమైన సెల్‌ఫోన్ సమస్య ఇబ్బందిగా మారింది. అసలు సెల్‌ఫోన్ లేని రోగులైతే మరీ ఇక్కట్లకు గురవుతున్నారు. కొందరికి సెల్‌ఫోన్ ఉన్నా దానికి ఆధార్ నంబర్ అనుసంధానమైందో లేదో తెలియని పరిస్థితి. ఆస్పత్రుల్లోని వైద్యులు మాత్రం అభా యాప్‌లో ఓపీ నమోదు చేసేందుకే ఈ ప్రక్రియ సాగుతోందని చెబుతున్నారు.


**రోజూ వెయ్యి మందికి పైగా ఓపీ**

పలమనేరులోని ఏరియా ఆస్పత్రిలో రోజూ సగటు ఓపీ రూ.500 వరకూ ఉంటోంది. ఇక నియోజకవర్గంలోని 11 పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీల్లో కలిపి రోగుల సంఖ్య మరో 500 దాకా ఉంటుంది. ఈ లెక్కన నిత్యం వెయ్యిమంది రోగులకు అభా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇది కొత్త విధానం కావడంతో ఓపీ రోగులకు కాస్త ఇబ్బందిగా మారింది.

**అసలు అభా సేవలంటే..**

ఇది కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. అభా(ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు). ఇందులో ప్రతి రోగికి ఓ హెల్త్ ఐడీ ఉంటుంది. దాంట్లో రోగి వివరాలు నిక్షిప్తమై ఉంటాయి. ఈ కార్యక్రమం నేషనల్ హెల్త్ అథారిటీ ద్వారా సాగుతోంది. రోగులకు సంబంధించిన అభా కార్డులో 14 అంకెల ఐడీ సంఖ్య ఉంటుంది. దీని ద్వారా భవిష్యత్తులో రోగి వ్యాధి వివరాలు, పొందిన చికిత్స, మెడికల్ రికార్డు తదితర సమాచారం అంతా ఉంటుంది.

**అవగాహన కల్పిస్తున్నాం**



కేంద్ర ప్రభుత్వ అభా ద్వారా ఓపీ రోగుల వివరాలను యాప్‌లోకి నిక్షిప్తం చేస్తున్నాం. ఇందులో భాగంగానే ఆధార్ లింకు అయిన ఫోన్ నంబర్‌ను సేకరిస్తున్నాం. ఆస్పత్రికొచ్చే రోగులందరికీ ట్రీట్‌మెంట్ ఇస్తున్నాం. ఎవరికైనా సెల్ ఫోన్ లేకపోతే లేదా ఆధార్ లింకు లేకుంటే మళ్లీ వచ్చేటప్పటికి చేసుకుని రావాలని వివరిస్తున్నాం. దీనివల్ల భవిష్యత్తులో రోగులకు మేలు కలుగుతుంది.

–డాక్టర్ మమతారాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్, పలమనేరు

# ధర పతనమై.. రైతు వికలమై..

ధర వస్తుందని పడమటి రైతులు ఈ సీజన్‌లో టమాట పంట భారీగా సాగు చేశారు. మొక్క ఏపుగా పెరిగింది.. కాయలు విరగ్గాసాయి.. అవి పండుగా మారుతుంటే రైతులు కళ్లు కాసేలా నిరీక్షించారు. నాలుగు కాసులు చేతికొస్తే.. వచ్చే సీజన్‌కు భరోసా కలుగుతుందని.. అప్పుల బాధలు తొలగిపోతాయని ఆనందించారు. కానీ వారి ఆశలు చితికాయి.. ధరల పతనంతో చేసిన అప్పులకు వడ్డీలు కూడా కట్టలేని స్థితి నెలకొంది.

- పలమనేరులో టమాట బాక్సు ధర రూ.60 నుంచి రూ.90
- హఠాత్తుగా పతనమైన ధరలు
- నాలుగు రాష్ట్రాల్లో మొదలైన సీజన్
- అనంతపురం నుంచి మార్కెట్లకు భారీగా వస్తున్న సరుకు



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాట

**పలమనేరు:** టమాట ధరలు ఉన్నట్టుండి భారీగా పతనమయ్యాయి. పలమనేరు టమాట మార్కెట్‌లో సోమవారం 14 కిలోల బాక్సు రూ.60 నుంచి రూ.90 వరకు పలగ్గా అత్యధిక నాణ్యత ఉన్నది రూ.100 వరకు మాత్రమే ధర పలికింది. ఇదే డిసెంబర్ తొలి వారంలో టమాట ధర బాక్సు రూ.800 పలికింది. ఈ సీజన్‌లో డిసెంబర్ ఆఖరు నుంచి కొత్త సంవత్సరంలో టమాట ధర రూ. వెయ్యి దాటుతుందని వ్యాపారులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. కానీ వారి ఆశలు అడియాలయ్యాయి. టమాట పండించే రాష్ట్రాల్లో సీజన్ మొదలై భారీగా టమాట వస్తోంది. పొరుగునే ఉన్న అనంతపురం సరుకు ఇక్కడి మార్కెట్లను ముంచెత్తుతోంది. దీంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. ఏదేమైనా టమాట ధరలు ఎప్పుడెలా ఉంటాయో తెలియక టమాట సేద్యం రైతులకు లాటరీగా మారింది.

**బయటి రాష్ట్రాల్లో మొదలైన టమాట సీజన్**

బయటి రాష్ట్రాల నుంచి వ్యాపారులు చిత్తూరు జిల్లాలోని మార్కెట్లకు వస్తుండడం, ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణాల్లో సీజన్ మొదలైంది. అనంతపురం జిల్లా నుంచి ఎక్కువగా టమాట ఇక్కడి మార్కెట్లకు చేరుతోంది. వర్షాలు, తెగుళ్లు, చలిమంచు కారణంగా స్థానికంగా ఉన్న తోటల్లో కాయల నాణ్యత తగ్గింది. ఇతర రాష్ట్రాల్లో టమాటకు డిమాండ్ తగ్గడం, ఆయా రాష్ట్రాల్లోనే కావాల్సినంత సరుకు అందుబాటులో ఉండడంతో బయటి వ్యాపారులు ఇక్కడికి రావడం లేదు. ఫలితంగా డిమాండ్ కంటే ఎక్కువగా సరఫరా ఉండడమే ఇందుకు కారణమైంది.

**పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో సాగు వివరాలివీ..**

- రబీలో టమాట సాధరణ సాగు: 5వేల హెక్టార్లు
- ప్రస్తుతం సాగైన పంట: 2వేల హెక్టార్లు
- ఇప్పుడు కోతదశలో ఉన్న తోటలు : వెయ్యి హెక్టార్లు
- పలమనేరు మార్కెట్‌కు వస్తున్న లోకల్ సరుకు రోజూ ఓ లారీ లోడ్
- అనంతపురం నుంచి ఇక్కడికి వస్తున్న సరుకు రోజూ మూడు లోడ్లు

**బయటి వ్యాపారులు వస్తేనే ధరలు**



బయట రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఎక్కువగా వస్తే టమాట ధరలుంటాయి. మూడు రాష్ట్రాల్లోనూ వారికి కావాల్సినంత సరుకు ఉంది. ఇక అనంతపురం సరుకు ఎక్కువగా వస్తోంది. దీంతో ఉన్నట్టుండి ధరలు తగ్గుముఖం పట్టాయి. ఎప్పుడు ధర పెరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ధరలతో రైతులకు నష్టం తప్పదు.

–మండీసుధా, టమాట మండీ వ్యాపారి, పలమనేరు

**పెట్టుబడి కూడా దక్కదు**



ఇప్పుడు టమాట కోతలు మొదలై మార్కెట్‌కు బాక్సులు తీసుకొచ్చా. ఇక్కడ ధర చూస్తే కోత కూలి, రవాణా చార్జీలకు సరిపోదనిపిస్తోంది. గత కొన్నాళ్లుగా టమాట రైతుల పరిస్థితి ఘోరంగా తయారైంది. ఎప్పుడు ధరలుంటాయో ఎప్పుడు ఉండవో అర్థమేకావడం లేదు. ఈ రేట్లుంటే టమాట రైతులకు తీవ్రమైన నష్టాలు తప్పవు. టమాట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

–కృష్ణారెడ్డి, టమాట రైతు, పెద్దవెలగటూరు, పెద్దపంజాణి మండలం

## టీటీడీ కల్యాణ మండపం రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



కాలువలో జేసీబీతో చేస్తున్న పూడికతీత పనులు

**రొంపిచెర్ల:** రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని టీటీడీ కల్యాణ మండపం రోడ్డుకు మరమ్మతులు చేశారు. జంగా నారాయణ రెడ్డికాలనీ నుంచి వచ్చే నీరు రోడ్డు పక్కనే ఉన్న కాలువ పొంగి రోడ్డు మీదకు రావడంతో రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు తేలాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. ఈ విషయమై 15 రోజుల క్రితం సాక్షి దినపత్రిక కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన ఎంపీడీఓ ముధుసూదన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి సోమవారం రోడ్డును పరిశీలించి గుంతలను పూడ్చి వేశారు. అలాగే రోడ్డు పక్కనే ఉన్న కాలువలో జేసీబీతో పూడిక తీశారు. గుంతలు పడ్డ రోడ్డు మీద తారురోడ్డు వేసేందుకు ఆర్ అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలియజేశారు.

### సారా కేంద్రాలపై ఎక్సైజ్ దాడులు

**చిత్తూరు అర్బన్:** గుడిపాల మండం రాసనపల్లెలో సారా తయారీ కేంద్రాలపై చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు సోమవారం దాడు లు నిర్వహించారు. రాసనపల్లె అటవీ ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు చేశారు. 2,700 లీటర్ల బెల్లం ఊటను అధికారులు ధ్వంసం చేశారు. దీనిపై మూడు కేసులు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు.